క్లుప్తంగా

నేడు విశ్వరూప్ ఎన్నికల ప్రచారం

ఉప్పలగుప్తం: మండలంలోని వానపల్లిపాలెం, గొల్లవిల్లి గ్రామాల్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

కేశనకుర్రులో నేడు ఎన్నికల ప్రచారం

ఐ.పోలవరం: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆదివారం మండలంలోని కేశనకుర్రు గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ పోటీల్లో ప్రతిభ



సాత్విక్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అమలాపురం రూరల్: ఈ నెల 20, 21వ తేదీల్లో విజయవాడలో జరిగిన ఆంధ్ర రాష్ట్ర ఓపెన్ చెస్ పోటీల్లో మండలంలోని భట్లపాలెం ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా రెండో ఏడాది చదువుతున్న ద్రాక్షారపు సాత్విక్ ప్రతిభ కనబరిచి టోర్నమెంట్ విజేతగా నిలిచాడు. జులై 15 నుంచి 23 వరకూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా సాత్విక్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీవీసీ రామారావు, ఫణిశంకర్, ఏఓ జక్కం కృష్ణారావు, పీడీలు కె.రవి సుధీర్, మురళీకృష్ణ తదితరులు అభినందించారు.

జూన్ 30లోగా లెక్కలు సమర్పించాలి

యానాం: పుదుచ్చేరి పార్లమెంటరీ నియోజకవర్గంలో పోటీ చేసిన అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయాలకు సంబంధించిన వివరాలను జూన్ 30లోగా సమర్పించాలని ఎన్నికల శాఖ అధికారులు బరిలో నిలిచిన అభ్యర్థులను కోరారు. ఎన్నికల శాఖ నిబంధనల ప్రకారం పోటీ చేసిన అభ్యర్థుల ఖర్చుకు ఒక్కొక్కరు రూ.75 లక్షల వరకూ పరిమితి విధించారన్నారు. ఈ నెల 19న జరిగిన ఎన్నికల్లో మొత్తం 26 మంది అభ్యర్థులు పోటీ చేశారని, ఇప్పటికే ఎన్నికల ఖర్చుల విభాగం అభ్యర్థుల వ్యయాలను పర్యవేక్షించి నివేదిక రూపొందించిందన్నారు. అభ్యర్థులు తమ ఎన్నికల వ్యయలెక్కల వివరాలను అందించేలా సహకరించాలని కోరారు.

లైఫ్ సర్టిఫికెట్ల మంజూరుకు సంతకాల సేకరణ

యానాం: నియోజకవర్గ పరిధిలోని పింఛను తీసుకుంటున్న మత్స్యకారుల కోసం లైఫ్ సర్టిఫికెట్ల మంజూరుకు క్షేత్రస్థాయిలో పరిశీలన, సంతకాల సేకరణ జరుగుతుందని మత్స్యశాఖ ఏడీ దడాల గొంతియ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న మెట్టకూరు, అయ్యన్ననగర్, దరియాలతిప్ప, 30న ఫ్రాన్సుతిప్ప, ఓల్డ్ రాజీవ్‌నగర్, కురసాంపేట, వచ్చే నెల 2న గిరియాంపేట, సావిత్రినగర్‌లో సంబంధిత సిబ్బంది పర్యటించి లబ్ధిదారుల నుంచి సంతకాలను సేకరిస్తారన్నారు.

ఎమ్మెల్సీ కుడుపూడి పరామర్శ



వెంకట్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

అమలాపురం రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అమలాపురం కిమ్స్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న ఐజేయూ సభ్యుడు, సీనియర్ పాత్రికేయుడు ఆచంట వెంకట్‌ను ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, ఏపీ రెవెన్యూ జేఏసీ అధ్యక్షుడు వీఎస్ దివాకర్ పరామర్శించారు. శనివారం రాత్రి అమలాపురంలో కిమ్స్ ఆసుపత్రికి వెళ్లి వెంకట్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కుడుపూడి త్రినాథరావు, గుత్తుల సుబ్రహ్మణ్యం, కుడుపూడి వెంకటేష్ తదితరులు పరామర్శించారు.

ఆయుష్మాన్ భారత్ రికార్డుల పరిశీలన

ఆలమూరు: మండలంలోని సూర్యారావుపేట ఆయుష్మాన్ భారత్ మందిరంలో శనివారం రికార్డుల పరిశీలన జరిగింది. పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సాయికిషోర్ స్థానిక కార్యాలయానికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. బాలింతలు, గర్భిణులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత సమయంలో చిన్నారులందరికీ టీకాలు వేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే వేసవి దృష్ట్యా ఇంటింటికీ ఓఆర్ఎస్ ద్రావణ ప్యాకెట్లను పంపిణీ చేయాలని కోరారు. సర్పంచ్ చింతపల్లి వెంకటలక్ష్మి, వైద్యారోగ్య సిబ్బంది వి.సువర్చల, ఆర్.శిలువరత్నం, నేరేడుమిల్లి వేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

99 శాతం ఎన్నికల హామీలు అమలుచేశాం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- గోడిలంక, గోడి, గోడితిప్ప గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



టీడీపీ కార్యకర్తలకు కండువాలు వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: 2019 ఎన్నికలకు ముందు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను 99 శాతం అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని గోడిలంక, గోడి, గోడితిప్ప గ్రామాల్లో శనివారం ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన మంత్రి విశ్వరూప్‌కు ప్రజలు అడుగడుగునా జేజేలు పలుకుతూ బ్రహ్మరథం పట్టారు. మహిళలు మంగళ హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన, ప్రకటించని హామీలను సైతం అమలుచేశామన్నారు. పుట్టిన బిడ్డ నుంచి వృద్ధాప్యంలో ఉన్న అవ్వతాతల వరకూ సంక్షేమ పథకాలు వర్తింపజేశామన్నారు. ఎన్నికల మేనిఫెస్టో అంటే మా పార్టీకి పవిత్ర గ్రంథమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024 ఎన్నికల మేనిఫెస్టోలో ఏవైతే హామీలను ప్రకటించారో వాటిని తూచా తప్పకుండా అమలుచేస్తామని విశ్వరూప్ ఓటర్లకు భరోసా కల్పించారు. ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. గోడి గ్రామంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి విశ్వరూప్ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి, వైఎస్ ఎంపీపీ వడ్డి గంగ, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ రుద్రరాజు లక్ష్మీపతిరాజు, గ్రామకమిటీ అధ్యక్షులు దొమ్మేటి వెంకటేశ్వరరావు, కొప్పాడి వెర్రియ్య, దత్తుడు రాజు, రేవు శ్రీనివాస్, జల్లి ఏడుకొండలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అభిమానులు పాల్గొన్నారు.

కరోనా సేవలపై ముద్రించిన నాణేల సేకరణ



కృష్ణ కామేశ్వర్ సేకరించిన నాణేలు

అమలాపురం టౌన్: కరోనా సమయంలో వైద్యుల సేవలను గుర్తిస్తూ పలు దేశాలు ఒక్కో నాణేన్ని మాత్రమే విడుదల చేశాయి. అయితే ఓషియానియాలోని ద్వీప దేశమైన సమోవా దేశం కరోనా సమయంలో ప్రజలకు సేవలందించిన వారిని గుర్తిస్తూ అర డాలర్ (50 సెంట్లు) ముఖ విలువ గల 14 నాణేలను ముద్రించింది. ఆయా నాణేలపై ఒక్కో రంగానికి చెందిన వ్యక్తుల సేవల చిత్రాలను రంగుల్లో నాణేల రూపంలో ముద్రించి విడుదల చేసింది. ఈ నాణేలను అమలాపురానికి చెందిన నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ ప్రత్యేక ఆర్డర్‌పై సేకరించారు.

సంక్షేమాభివృద్ధిలో ఇంటింటా జగన్ మార్క్



కోరంగిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



పాతకోరంగిలో ఎమ్మెల్యే పొన్నాడ, బాలకృష్ణలకు హారతి ఇస్తున్న మహిళ

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- కోరంగిలో ఎన్నికల ప్రచారం

తాళ్లరేవు: సంక్షేమం, అభివృద్ధిలో ఊరూరా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్క్ కనిపిస్తుందని, రాబోయే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ కోరారు. శనివారం ఆయన కోరంగి గ్రామ పంచాయతీలోని బొడ్డువానిలంక, పాతకోరంగి, కొత్తకోరంగి, సీతారామపురం తదితర ప్రాంతాల్లో పార్టీ నేతలు పితాని బాలకృష్ణ, కాశి బాలమునికుమారి, పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పొన్నాడకు మహిళలు హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పొన్నాడతో పాటు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్‌లను దుశ్శాలువాలతో సత్కరించారు. అనంతరం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చి ఓట్లు అడుగుతున్నామన్నారు. ప్రస్తుత ఎన్నికల మేనిఫెస్టో–2024లో సైతం అమలయ్యే పథకాలనే జగన్ పెట్టారన్నారు. అభివృద్ధి, సంక్షేమం అందించిన జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన ఆవశ్యకత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి నాగరాజు, సర్పంచ్ పెయ్యల మంగేష్, ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి, వేగేశ్న రామరాజు(రమేష్ రాజు), రేవు మల్లీశ్వరి, వెంటపల్లి వాసంతి, దడాల జగదీశ్వరరావు, బొంతు మోహన్, మోకా మధుబాబు, యర్రంనీడి అప్పారావు, కామాడి భైరవమూర్తి, నరాల హేమసుందర్, పితాని సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి చూసి గెలిపించండి



అమలాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి విశ్వరూప్ సతీమణి బేబీ మీనాక్షి



పట్టణంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి మళ్లీ గెలిపించాలని మంత్రి పినిపే విశ్వరూప్ సతీమణి బేబీ మీనాక్షి, కుమారుడు డాక్టర్ శ్రీకాంత్‌లు ఓటర్లను అభ్యర్థించారు. పట్టణంలోని 2వ వార్డులో బేబీ మీనాక్షి, 15వ వార్డులో డాక్టర్ శ్రీకాంత్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం ఇంటింటా ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అటు ముఖ్యమంత్రి జగన్‌ను, ఇటు మంత్రి విశ్వరూప్‌ను గెలిపించాలని కోరారు. 2వ వార్డులోని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కల్వకొలను ఛాయాదేవి, కోనసీమ కాపు జేఏసీ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీల ఇళ్లకు బేబీ మీనాక్షి స్వయంగా వెళ్లి ఓట్లు అభ్యర్థించారు.

ప్రచార కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, మండల పరిషత్ అధ్యక్షురాలు కుడుపూడి భాగ్యలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్లు వాసర్ల లక్ష్మి, గొవ్వాల రాజేష్, బండారు గోవిందు, చిట్టూరి పెదబాబు, దొమ్మేటి రాము, కట్టోజు సన్యాసిదాసు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



సదస్సులో మాట్లాడుతున్న కోరంగి ఎస్‌ఐ రవికుమార్

తాళ్లరేవు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వివాహ వయసు రాకుండా పెళ్లి చేస్తే వధూవరుల తల్లిదండ్రులపై చర్యలు తప్పవని కోరంగి ఎస్‌ఐ శనగశెట్టి రవికుమార్ హెచ్చరించారు. శనివారం జి.వేమవరం గ్రామంలో బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కాకినాడ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కోరంగి ఎస్‌ఐ పాల్గొని మాట్లాడారు. జి.వేమవరం పంచాయతీలో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వధువుకు 18 ఏళ్లు దాటకుండా వివాహం చేస్తే వరుడు, వరుడి తల్లిదండ్రులపై పోక్సో చట్టం ప్రకారం పదేళ్ల జైలు శిక్ష విధిస్తారన్నారు. 16 ఏళ్ల లోపు బాలికకు వివాహం చేస్తే 20 ఏళ్లకు పైగా జైలుశిక్ష పడుతుందన్నారు. సదస్సులో తాళ్లరేవు సీడీపీఓ వంజరాన మాధవి, కాకినాడ చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, విస్తరణాధికారి లలిత, పంచాయతీ కార్యదర్శి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల జాతర

మామిడికుదురు: లూటుకుర్రు గ్రామ దేవత పెద్దింట్లమ్మ జాతర 28వ తేదీ ఆదివారం నుంచి మే 2వ తేదీ గురువారం వరకు అయిదు రోజులు జరుగుతుందని ఆలయ కమిటీ శనివారం తెలిపింది. ఆదివారం ఉదయం 8 గంటలకు కుంకుమ పూజలు ఏర్పాటు చేశామని, మధ్యాహ్నం 11 గంటలకు అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. 29న నైవేద్యాలు చెల్లిస్తారని చెప్పారు. జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మ వారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

ఘనంగా పోలమ్మ జాతర

ఈదరాడ గ్రామ దేవత పోలమ్మ జాతర మహోత్సవం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ జాతర ఆద్యంతం కనులపండువలా జరిపించారు. అమ్మవారికి శనివారం భక్తులు నైవేద్యాలు చెల్లించారు. జాతర మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. భారీగా విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేశారు. అమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారం వరకు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ యెరుబండి శ్రీరామమూర్తి తెలిపారు.

మాచర పాఠశాలకు రూ.50 వేల నిధి

కపిలేశ్వరపురం: మండలంలోని మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన దాతలు రెండో విడతగా రూ.50 వేల శాశ్వత నిధిని సమకూర్చినట్టు హెచ్ఎం రమాదేవి శనివారం తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయుడు గొడవర్తి రాంప్రసాద్, సోదరులు సోమ సూర్య ప్రకాశరావు, గంగాధర వీరప్రభాకరరావు, సోదరి జానకీరత్నలు తమ తల్లిదండ్రులు గొడవర్తి వెంకట్రావు, సుబ్బాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం పాఠశాలకు నిధిని ఏర్పాటు చేశారు. గతంలో రూ.50 వేలు అందజేయగా ఆ నిధి వడ్డీ సొమ్ముతో పాఠశాలలో ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తూ వస్తున్నారు. కాగా మరో రూ.50 వేలు సమకూర్చడంతో మరింత మంది మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేయనున్నట్టు హెచ్ఎం రమాదేవి తెలిపారు. దాతలను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆపన్నహస్తం

మండపేట: మండలంలోని అర్తమూరులో ఇటీవల మృతి చెందిన ఆటో డ్రైవర్, వైఎస్సార్ సీపీ వీరాభిమాని వాసంశెట్టి వెంకటరమణ (ఆటో కొండ) కుటుంబానికి గ్రామంలోని ఆ పార్టీ నాయకులు ఆపన్న హస్తం అందించారు. వారంతా కలసి రూ.30 వేలు సేకరించారు. ఆ మొత్తాన్ని శనివారం మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొలుగూరి విజయభాస్కరరెడ్డి తదితరుల చేతుల మీదుగా ఆటో కొండ కుటుంబానికి అందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన వారిలో కర్రి వీరిరెడ్డి, చిర్ల జయరామ్ రెడ్డి, గొలుగూరి సందీప్‌రెడ్డి, తేతలి భూపతిరెడ్డి, చిర్ల శ్రీరామ్‌రెడ్డి, గొలుగూరి శ్రీనివాస్‌రెడ్డి, కొవ్వూరి నాగిరెడ్డి, తేతలి సాయిబాబారెడ్డి, కొవ్వూరి వీరారెడ్డి, సత్తి సత్యనారాయణరెడ్డి, కర్రి బుల్లిస్వామి రెడ్డి, నల్లమిల్లి రామచంద్రారెడ్డి ఉన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నగరం ఎస్సై సురేష్

మామిడికుదురు: ప్రజాస్వామ్యం ప్రసాదించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని నగరం ఎస్సై పి.సురేష్ సూచించారు. మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాలలో శనివారం కళాశాల కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఎస్సై మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఐదేళ్లకు ఒకసారి జరిగే ఎన్నికల్లో ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు ఓటు ప్రాధాన్యతను గుర్తించి ఓట్లు వేయాలన్నారు. దీనిపై ప్రజల్లో కూడా అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో జాతీయ సేవా పథకం విద్యార్థులు భాగస్వాములు కావాలని ఎస్సై కోరారు. బాధ్యతాయుతమైన ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఓటర్లను వరుస క్రమంలో పంపే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ మోకా రంగారావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు వాసంశెట్టి నాగరాజు, పొన్నమండ సుబ్బారావు, బి.సృజన, పి.రాధ, వై.రవికుమార్, కేవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి

రావులపాలెం: ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకున్నట్టు సార్వత్రిక ఎన్నికల జిల్లా ఎన్నికల అబ్జర్వర్ పరదీప్ కుమార్ అన్నారు. శనివారం రావులపాలెం మండలంలోని అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గత ఎన్నికలు నిర్వహించిన తీరు, పోలింగ్ శాతం తదితర వివరాలను ఆయన పరిశీలించారు. అలాగే రావులపాలెం బాలుర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు.

మజ్జిగతో ఉపశమనం

అంబాజీపేట: అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలకు చల్లని మజ్జిగతో ఉపశమనం లభిస్తుందని సర్పంచ్ వాసంశెట్టి రేవతి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి పెదబాబులు అన్నారు. వక్కలంకలో బాటసారులకు, ఉపాధి కూలీలకు, వృద్ధులకు సర్పంచ్ రేవతి ఆధ్వర్యంలో మజ్జిగను శనివారం పంపిణీ చేశారు. రేవతి, పెదబాబులు మాట్లాడుతూ వేసవి తాపానికి ప్రయాణికులు అల్లాడుతున్నారని వారు సేదతీరేందుకు చలివేంద్రాలను ప్రతి ఒక్కరూ ఏర్పాటు చేయాలని కోరారు.

కిమ్స్ విద్యార్థులకు యూనివర్సిటీ ర్యాంకులు

అమలాపురం రూరల్: గత నెలలో విజయవాడ డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నిర్వహించిన వార్షిక పరీక్షల్లో తమ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయి ర్యాంకులు సాధించారని అమలాపురం కిమ్స్ పారా మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఫరీద్‌బాబు శనివారం తెలిపారు. బీఎస్ఈ పారామెడికల్ మూడో ఏడాది పరీక్షల్లో శ్వేత యూనివర్సిటీ ప్రథమ ర్యాంకు సాధించగా, నాగలక్ష్మి ద్వితీయ ర్యాంకు సాధించారన్నారు. ప్రథమ సంవత్సర పరీక్షల్లో మోహిత్ యూనివర్సిటీ స్థాయి నాలుగో ర్యాంకు, బన్నీ, రబియాబాసరిలు తొమ్మిదో ర్యాంకు సాధించారన్నారు. బీఎస్ఈ ఎంఎల్‌టీ మూడో ఏడాది పరీక్షల్లో ఆంజనేయకుమార్ ప్రథమ ర్యాంక్, బీబీ లాల్ అహ్మద్ ద్వితీయ ర్యాంక్ పొందగా, సిరి తృతీయ ర్యాంక్ సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను, అధ్యాపకులను కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ రాజు, ఎండీ రవికిరణ్ వర్మ, డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుబ్బారావు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ హరికిరణ్ వర్మ, వైస్ ప్రిన్సిపాల్ ఫరీద్ బాబులు అభినందించారు.

మద్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

- ఆంధ్రప్రదేశ్, యానాం ఎక్సైజ్ అధికారుల సమావేశం
- సరిహద్దు చెక్ పోస్టుల వద్ద నిఘా పెంచాలని నిర్ణయం



సమావేశంలో చర్చిస్తున్న యానాం, కాకినాడ, అమలాపురం ఎక్సైజ్ అధికారులు

యానాం: వచ్చే నెల 13న ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి మద్యం, నాటుసారాలు అక్రమంగా రవాణా కాకుండా నిఘా ఉంచేలా ఇరు రాష్ట్రాల ఎక్సైజ్ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని యానాం, ఏపీ ఎక్సైజ్, పోలీస్ శాఖలు నిర్ణయించాయి. శనివారం స్థానిక ఆర్ఏఓ చాంబర్‌లో రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి అధ్యక్షతన అమలాపురం, కాకినాడ ఎక్సైజ్ శాఖల సూపరింటెండెంట్లు, సిబ్బందితో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మే 13న ఎన్నికల నేపథ్యంలో భౌగోళికంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి చవకగా లభించే మద్యం అక్రమ రవాణా అవుతున్న నేపథ్యంలో దాన్ని అరికట్టేందుకు సరిహద్దుల వద్ద యానాం చెక్‌పోస్టులను తిరిగి ప్రారంభించాలని కోరారు. యానాం, ఏపీ ఎక్సైజ్ సిబ్బంది సంయుక్తంగా నిఘా ఉంచాలని నిర్ణయించారు. అదేవిధంగా పరస్పరం సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలన్నారు. గోదావరి లంకల్లోని మడ అడవుల నుంచి వచ్చే నాటుసారాకు సైతం అడ్డుకట్ట వేయాలన్నారు. మే 11వ తేదీ నుంచే యానాంలో మద్యం షాపులు మూసివేయాలని కోరారు. సమావేశంలో యానాం ఎస్పీ రాజశేఖరన్, అమలాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్‌కుమార్ సింగ్, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జి.అమర్‌బాబు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సాయిస్వరూప్, ఎస్ఈబీ స్టేషన్ ఎస్ఐ టి.చిట్టిబాబు, డి.రామారావు, ఎన్.లక్ష్మీకాంతమ్మ, ఎన్.శ్రీధర్, యానాం డీటీ ఇన్‌చార్జి ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసి పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటిక బెల్లం మొక్కుగా చెల్లించారు.

శ్రీవేంకటేశ్వర ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తిపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్ఛారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతా మూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

మర్రింత హాయిగా...



విలసవిల్లి గ్రామంలో ఆకర్షణీయంగా ఉన్న మర్రిచెట్టు

ఉప్పలగుప్తం: మండుతున్న ఎండల్లో వడగాల్పుల దెబ్బకు ఏ వయసు వారైనా సరే పచ్చని చెట్టు కనిపిస్తే చాలు సేద తీరాలని అనిపిస్తుంది. మండలంలోని విలసవిల్లి గ్రామంలో పెదమర్రిగా పిలవబడే ప్రాంతంలో ఈ మర్రిచెట్టు నీడనిస్తూ, దాని ఊడలతో ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తుంది. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు, వ్యవసాయ కూలీలకు ఈ చెట్టును చూసిన వెంటనే సేద తీరాలిగా మరి అనిపిస్తుంది.